



చిన్నపిల్లల వార్డును పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాకర్ రెడ్డి

పేరుకే ఉచితం

అధికార పార్టీ నాయకులు ఇసుక ఉచితం అని చెబుతున్నా ఇసుక కోసం వేలల్లో ఖర్చు చేయాల్సి వస్తోంది. గుడికంబాలి స్టాక్ పాయింట్‌లో అధికారికంగా టన్ను ఇసుక కోసం రూ.335 వసూలు చేస్తున్నారు. రవాణా ఛార్జీలు తడిసి మోపెడవుతున్నాయి. దాదాపు గత ప్రభుత్వంలో ఇసుక కోసం చెల్లించిన మొత్తంలోనే ఇప్పుడు కూడా చెల్లించాల్సి వస్తోంది...

- టన్ను ఇసుక రూ.335 - తడిసి మోపెడవుతున్న రవాణా ఛార్జీలు



ఇసుక కోసం బారులుతీరిన టిప్పర్లు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

రాష్ట్రంలో కూటమి ప్రభుతం, నాయకులు చెబుతున్నట్లు ఇసుక ఉచితంగా లభించడం లేదు. డబ్బులు పెట్టి కొనుగోలు చేసి తెచ్చుకోవాల్సిందే. ఉమ్మడి కర్నూలు జిల్లాలో గుర్తించిన ఏకైక ఇసుక రీచ్ కౌతాళం మండలం గుడికంబాలిలో టన్ను ఇసుకను అధికారులు దగ్గరుండి రూ.335 ప్రకారం విక్రయిస్తున్నారు. 4 టన్నులు పట్టే ట్రాక్టర్ ఇసుకకు రూ.1340, 18 టన్నులు పట్టే టిప్పర్ ఇసుకకు రూ.6,030 చెల్లించి వినియోగదారులు తమ ఇళ్లు, ఇతర నిర్మాణాలకు తరలిస్తున్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన భవన నిర్మాణదారులకు మంత్రాలయం నియోజకవర్గంలోని కౌతాళం మండలం గుడికంబాలిలో మాత్రమే రీచ్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఇక్కడ దాదాపు 29వేల టన్నుల ఇసుక నిల్వలు ఉన్నాయి. సోమవారం నుంచి ఇసుక సరఫరా ప్రారంభమైంది. మొదటి రోజు కేవలం రెండు టిప్పర్లను మాత్రమే తరలించారు. రెండో రోజు మంగళవారం దాదాపు 71 టిప్పర్లు, 30 ట్రాక్టర్ల ద్వారా ఇసుక అవసరం ఉన్న వారు తరలించుకుపోయారు. టన్ను ఇసుక రూ.335 ప్రకారం చెల్లించి తీసుకెళ్లారు. టిప్పర్‌లో 18 టన్నుల ఇసుక పడుతుండడంతో రూ.6,030, ట్రాక్టర్‌లో 4 టన్నుల ఇసుకను తరలించేందుకు అనువుగా ఉండడంతో రూ.1,340 చెల్లిస్తున్నారు. గత ప్రభుత్వంలో కౌతాళంకు గుడికంబాలి నుంచి ట్రాక్టర్ ఇసుకను తీసుకెళ్లేందుకు రూ.4వేలు వరకూ ఖర్చు చేయాల్సి వస్తోంది. ప్రస్తుతం రవాణా ఛార్జీలతో కలిపి దాదాపు అదే మొత్తంలో వెచ్చించాల్సి వస్తోంది. కర్నూలు నుంచి గుడికంబాలి 131 కిలో మీటర్ల దూరంలో ఉంది. టిప్పర్ ఇసుక కోసం అక్కడికి వెళ్తే రవాణా ఛార్జీలు దాదాపు రూ.26 వేలు చెల్లించాల్సి ఉంటుంది. దీనికి ఇసుక ధర రూ.6,030 అదనం. ఈ నేపథ్యంలో కర్నూలు వాసులు టిప్పర్ ఇసుక తెచ్చుకోవాలంటే రూ.32 వేలు చెల్లించక తప్పని పరిస్థితి. ప్రస్తుతం గుడికంబాళిలో మాత్రమే ఇసుక లభిస్తుండడంతో కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని అన్ని నియోజవకర్గాలకు చెందిన భవన నిర్మాణదారులు అక్కడికి వెళ్లాల్సిందే. ఆదోని, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాలకు చెందిన ప్రజలు కూడా టిప్పర్ ఇసుక కోసం దాదాపు రూ.20 వేల ఖర్చు చేయాల్సి ఉంటుంది. నందికొట్కూరు, శ్రీశైలం నియోజకవర్గాలకు చెందిన భవన నిర్మాణదారులకు రవాణా చార్జీలతో కలుపుకొని టిప్పర్ ఇసుక కోసం దాదాపు రూ.35 వేల వరకు ఖర్చు వస్తుంది. నంద్యాల, బనగానిపల్లె, ఆళ్లగడ్డ, డోన్, పాణ్యం నియోజకవర్గాలకు చెందిన వారు టిప్పర్ ఇసుక కోసం దాదాపు రూ.35 నుంచి రూ.40 వేల వరకు చెల్లించాల్సిందే. గుడికంబాలి రీచ్‌లో వేబ్రిడ్జి లేకపోవడంతో అందాజుగా ఇసుకను లోడ్ చేస్తున్నారు. దీంతో బరువులో తేడాలు ఉంటాయని పలువురు చెబుతున్నారు. తుంగభద్ర నదికి నీరు వస్తే గుడికంబాలి రీచ్ నుంచి ఇసుకను తీసుకునేందుకు అవకాశం ఉండదు. వారం రోజుల్లో గుడికంబాళిలో ఉన్న ఇసుక నిల్వలు కూడా తరిగిపోనున్నాయి. సెప్టెంబర్ వరకు ఇక్కడ ఇసుకను తీయడానికి అవకాశం ఉండదు. ఈ నేపథ్యంలో ఇసుక కొరతను అధిగమించేందుకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి. జిల్లాలో గుడికంబాళితో పాటు సి.బెళగల్ మండలం కొత్తకోట, పల్లెదొడ్డి, ముడుమాల, ఈర్లదిన్ని, కె.సింగవరం సమీపాల్లో డిసిల్టింగ్ పాయింట్లను ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. అయితే వీటికి పర్యావరణ అనుమతుల కోసం ప్రభుత్వానికి పంపారు. ప్రభుత్వ అనుమతులు వచ్చే వరకు ఆయా పాయింట్లలో ఇసుక తీయడానికి వీలుండదు.

మారనున్న జిజిహెచ్ రూపురేఖలు

- యుద్ధ ప్రాతిపదికన చర్యలు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల రూపురేఖలను మార్చేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టారు. డాక్టర్ ప్రభాకర్ రెడ్డి సూపరింటెండెంట్‌గా విధులు చేపట్టగానే మార్పులకు శ్రీకారం చుట్టారు. ఎప్పటి నుంచో ఉన్న సమస్యలను కొలిక్కి తెచ్చేందుకు చర్యలు చేపడుతున్నారు. ఓపి కోసం ఎక్కువ మంది లైనులో ఉండడం, ఆలస్యం అవడాన్ని గమనించి ఎనిమిది డిజిటల్ కౌంటర్లను ఏర్పాటు చేశారు. కాన్పుల వార్డు దగ్గర, పిల్లల వార్డు దగ్గర ఇంకో రెండు కౌంటర్లు ఉండటం వల్ల మొత్తం 10 కౌంటర్లలో ఓపి టిక్కెట్లు ఇస్తున్నారు. గతంలో ఓపి టికెట్ 9 గంటల నుంచి ఇచ్చే వాళ్లు. ఎనిమిది గంటల నుంచే ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. క్యాజువాలిటీలో ఉన్న 20 పడకలు ఎప్పుడూ కూడా మధ్యాహ్నము సాయంత్రం పూట పేషెంట్స్ ఎక్కువగా పెరిగిపోవడం వల్ల ఒక్కొక్క బెడ్ మీద ఇద్దరు, ముగ్గురు రోగులను ఉంచేవారు. దగ్గరలో ఉన్న ఫార్మసీని, ఇసిజి రూమును వేరే చోటకు తరలించి క్యాజువాలిటీ విస్తరించి మరో 20 పడకలు ఏర్పాటు చేశారు. ఇందులో ఐదు మందికి అత్యవసర వెంటిలేటర్ పెట్టే సదుపాయం కూడా కల్పించారు. ఇసిజి గది ఇరుకుగా, మబ్బుగా ఉండటంతో న్యూ డయాగ్నస్టిక్ బ్లాక్‌లో కార్పొరేట్ హాస్పిటల్స్ స్టైల్‌లో రెండు ఇసిజి మిషన్లతో కొత్తగా ఇసిజి గదిని తయారు చేయించారు. ఎఎంసి వార్డులో సరైన సంఖ్యలో బెడ్లు లేకపోవడంతో నిరుపయోగంగా ఉన్న పాత బ్లడ్ బ్యాంక్‌ని అధీకరించి ఎఎంసి2గా ఏర్పాటు చేయడానికి, 12 బెడ్లతో కొత్తగా 12 వెంటిలేటర్లు, 12 మానిటర్లతో ఎయిర్ కండిషన్స్‌తో నిర్మించడానికి పని ప్రారంభించారు. ఎన్నారై డాక్టర్ రంగారెడ్డి 1964 బ్యాచ్ సహకారం అందించి దానికి కావాల్సిన 12 మానిటర్లు, ఇంకో ఎన్నారై అనుపమ 7 ఎయిర్ కండిషన్‌లు ఇవ్వడానికి ముందుకు వచ్చారు. ఎఎంసిలో పడక దగ్గరనే అల్ట్రాసౌండ్ చేసే సౌకర్యం లేకపోవడం వల్ల క్రిటికల్ కేర్ రోగులను అల్ట్రా సౌండ్ కోసం తిప్పడం మంచిది కాదు అని భావించి అక్కడ ఒక అల్ట్రాసౌండ్, ఎకో మిషన్‌ను ఏర్పాటు చేశారు. గర్భవతులు స్కానింగ్ కోసం అటూ ఇటూ తిరగడం గమనించి పాత రేడియాలజీలో ఉన్న మూడు స్కానింగ్ మిషన్లను కూడా కొత్త డయాగ్నొస్టిక్ బ్లాక్లోకి మార్చి మొత్తం ఆరు అల్ట్రా సౌండ్ స్కానింగ్ మిషన్ ఒకే చోట ఏర్పాటు చేశారు. కాన్పుల వార్డులో కాంప్లికేటెడ్ కాన్పుల కోసం ఒక కాన్పుల ఐసియును అప్‌గ్రేడ్ చేశారు. అంతేకుండా హెచ్ఐవి, హెచ్‌బిఎస్ఎజి వాళ్ళ కోసం ప్రత్యేకంగా ఒక డెలివరీ రూమును ఏర్పాటు చేశారు.

స్పెషాలిటీ ఓపిల పొడిగింపు : స్పెషాలిటీ ఓపీలు రెండు రోజులే ఉండడం వల్ల ఎవరికైనా క్రాస్ రిఫరల్ చేసినా పరీక్షలు లేటైతే మరల వారం రావాలి అంటే చాలా దూరాభారం వలన పేషెంట్లకు ఆర్థిక భారం అయ్యేది. ప్రతిరోజు సోమవారం నుంచి శుక్రవారం వరకు ఓపిలు ఉండే విధంగా మార్పులు చేశారు. ఎన్నాళ్ళుగానో మూతపడిన అంటువ్యాధుల వార్డును ఇపుడు డయేరియా సీజన్ వస్తుందని ముందు జాగ్రత గా 20 పడకలతో ఏర్పాటు చేశారు. విద్యుత్ సమస్యలను ఎదుర్కొనేందుకు పవర్ హౌస్‌లో అనుభవం ఉన్న ముగ్గురు వ్యక్తులను తీసుకోవడానికి విజ్ఞాపనలు పంపారు. రూ.4.5 లక్షలతో ట్రాన్స్‌ఫార్మరులకు మరమ్మత్తులు చేయించారు. ఆస్పత్రిలో డ్రైనేజ్ ప్రాబ్లం ఎక్కువగా ఉంది. రూ.100కోట్లతో నూతన డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు కోసం ప్రతిపాదనలు తయారు చేశారు. మొదట రూ.ఆరు కోట్లతో అభివృద్ధి డెవలప్మెంట్ చేయడం కోసం ప్రతిపాదనలు పంపించారు. సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్, శానిటేషన్ సిబ్బందిని క్రమశిక్షణలో ఉంచడం కోసం వాళ్లకు నోటీసులు జారీ చేశారు. డైట్ సక్రమంగా అందించే విధంగా చూడాలని ప్రత్యేకంగా పర్యవేక్షణ అధికారిణిని నియమించారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు
- కలెక్టరేట్ ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.అంజిబాబు కోరారు. అలాగే స్కీం వర్కర్లందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సిఐటియు ఆల్ ఇండియా కమిటీ పిలుపు మేరకు డిమాండ్స్ డే కార్యక్రమంలో భాగంగా బుధవారం కర్నూలు కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. సిఐటియు ఓల్డ్ సిటీ కార్యదర్శి విజయ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడారు. కార్మికులకు నష్టదాయకమైన విధానాలను కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తోందని, విధానాలను మానుకోవాలని తెలిపారు. లేబర్ కోడ్‌లను అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. అలాంటి ప్రయత్నమే చేస్తే కార్మికుల నుంచి తీవ్ర ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. స్కీం వర్కర్లు అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. వీరికి ప్రభుత్వ పథకాలు కూడా అమలు జరిగే విధంగా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అసంఘటితరంగ కార్మికులై హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి సమగ్రమైన వేతన చట్టాన్ని రూపొందించాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ మాట్లాడుతూ... మోటార్ ట్రాన్స్‌పోర్ట్ రంగంలో కేంద్ర ప్రభుత్వం అనేక మార్పులు తీసుకొచ్చిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన చట్టాలను రద్దు చేయాలని కోరారు. హిట్ అండ్ రన్ పేరుతో తెచ్చిన చట్టం వల్ల కార్మికులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని తెలిపారు. భవన నిర్మాణ రంగంలో గత ప్రభుత్వం అనుసరించిన విధానాలు కాకుండా లేబర్ బోర్డు ద్వారా వారికి ప్రయోజనం కలిగే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు మహేష్, మద్దిలేటి, యాకోబు, సిఐటియు న్యూసిటీ కమిటీ కార్యదర్శి సిహెచ్.సాయిబాబా, ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు రాధిక మాట్లాడారు. సిఐటియు నగర ఉపాధ్యక్షులు రాముడు, రాజశేఖర్, సిఐటియు న్యూ సిటీ కమిటీ అధ్యక్షులు నరసింహులు, ఆటోవర్కర్స్ యూనియన్ న్యూ సిటీ కమిటీ కార్యదర్శి రాధాకృష్ణ, అధ్యక్షులు వలీ, ఓల్డ్ సిటీ కార్యదర్శి మెహమూద్, సిఐటియు ఓల్డ్ సిటీ నాయకులు అబ్దుల్ దేశాయ్, న్యూ సిటీ నాయకులు సుధాకరప్ప, మహ్మద్ రఫీ, ఏసు, సివిల్ సప్లయిస్ హమాలీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కృష్ణ పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసనలో మాట్లాడుతున్న అంజిబాబు

ఐసిడిఎస్‌ను బలోపేతం చేయాలి

ఐసిడిఎస్‌కు కేంద్ర ప్రభుత్వం ఎక్కువ నిధులు కేటాయించి బలోపేతం చేయాలని శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ పి.నిర్మల డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు రేణుకమ్మ అధ్యక్షతన ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ అమలు చేయాలని కోరారు. ఐసిడిఎస్ ప్రయివేటీకరణ, ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను ఆపాలని డిమాండ్ చేశారు అనంతరం ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు రాధాకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు, సిఐటియు న్యూ సిటీ కమిటీ కార్యదర్శి సాయిబాబా, న్యూ సిటీ నాయకులు మహ్మద్ రఫీ, అంగన్వాడీ యూనియన్ కర్నూలు అర్బన్ ప్రాజెక్టు నాయకులు బాలదుర్గమ్మ, విజయలక్ష్మి, రమాదేవి పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన చేపడుతున్న అంగన్వాడీలు

వేరుశనగ విత్తనాల సరఫరాకు చర్యలు

- కౌలు రైతులకు సిసిఆర్‌సి కార్డులు
- కలెక్టర్ రంజిత్ బాషా

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో వేరుశనగ విత్తనాలకు డిమాండ్ ఉన్న నేపథ్యంలో సరఫరాకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసేందుకు వ్యవసాయ శాఖ కమిషనర్‌కు లేఖ రాయాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. రైతుల పంటల సాగు ఇతర అంశాలన్నింటిపై ప్రత్యేక యాప్ కూడా తయారు చేయనున్నట్లు పేర్కొన్నారు. అర్హత కలిగిన కౌలు రైతులందరికీ సిసిఆర్‌సి కార్డులు ఇవ్వాలని వ్యవసాయ, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ, అనుబంధ శాఖ అధికారులతో కలెక్టర్ రంజిత్ బాషా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాకు 22,235 సిసిఆర్‌సి కార్డులు లక్ష్యం కాగా ఇప్పటివరకు వంద కార్డులు అందజేశారని, సీజన్ తర్వాత ఇచ్చి లాభమేమిటని అధికారులను ప్రశ్నించారు. ఇందుకు సంబంధించి రెవెన్యూ శాఖ నుంచి కూడా ఆదేశాలు వచ్చాయన్నారు. జెసితో మాట్లాడి త్వరగా వీటిని పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇంటిగ్రేటెడ్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్స్ ద్వారా కేవలం 308 పరీక్షలే చేశారని, వీటి సంఖ్య చాలా పెరగాలని వ్యవసాయ శాఖాధికారులను ఆదేశించారు. సీజన్‌కు ముందే ఈ పరీక్షలను మొదలు పెట్టాలని, ముఖ్యంగా పంటలు దెబ్బతిన్న ప్రాంతాలకు వెళ్లి పరీక్షలు చేయాలని అధికారులకు సూచించారు. కేంద్ర ప్రభుత్వంతో అమలు చేస్తున్న సంపూర్ణతా అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఎంపిక చేసిన మూడు మండలాల్లో గుర్తించిన సూచికలను త్వరగా పూర్తి చేయాలన్నారు. జీరో బడ్జెట్ నేచరల్ ఫార్మింగ్, సాధారణ వ్యవసాయం పోల్చుతూ కంపారిటివ్ స్టేట్‌మెంట్‌ను తయారు చేయాలని ఆదేశించారు. సహకార పరపతి సంఘాలకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని ఎపిఎంఐపి పీడీని ఆదేశించారు. ఉల్లిపంట స్టోరేజీకి సంబంధించిన ఉడెన్ బేస్డ్ స్ట్రక్చర్స్‌ను డ్వామాలో మెటీరియల్ కంపోనెంట్ కింద నిర్మించే వెసలుబాటు ఉంటుందా అని ఉన్నతాధికారులకు లేఖ రాయాలని హార్టికల్చర్ అధికారిని ఆదేశించారు. జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, ఎపిఎంఐపి పీడీ ఉమాదేవి, జిల్లా హార్టికల్చర్ అధికారి రామాంజనేయులు పాల్గొన్నారు.



ఖైదీల్లో సత్ప్రవర్తనకు కృషి చేయాలి

- కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

జైలు జీవితం గడుపుతున్న వారిలో మానసిక ఆందోళనను దూరం చేస్తూ, వారిలో సత్ప్రవర్తనను పెంపొందించే విధంగా జైలు అధికారులు కృషి చేయాలని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు కోరారు. బుధవారం ఆయన ఎంపీ హోదాలో మొదటి సారి జిల్లా జైలును సందర్శించారు. వివిధ కేసుల్లో శిక్ష పడిన ఖైదీలను కలిసి జైలులో వారికి అందిస్తున్న భోజనం, ఇతర సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే ఏ కేసుల్లో జైలుకు వచ్చారని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జైలు నిబంధనలకు అనుగుణంగా ఖైదీలకు అన్ని వసతి, సౌకర్యాలు కలిపించాలని అధికారులకు సూచించారు. ఖైదీల్లో మార్పు వచ్చేందుకు జైలు వాతావరణం దోహదపడేలా చూడాలని తెలిపారు. ఇక చేసిన తప్పులను సరిదిద్దుకోవాలని, తప్పు చేశామనే పశ్చాత్తాపం ప్రతి ఒక్కరిలో కలగాలని కోరారు. జైలు సూపరింటెండెంట్ నరసింహారెడ్డి, జైలర్ ఎరికి నాయుడు, డిప్యూటీ జైలర్ నాగరాజు పాల్గొన్నారు.

15న జిల్లా సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలు

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

జిల్లా సాఫ్ట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 15న స్థానిక అవుట్‌డోర్ స్టేడియంలో జిల్లా స్థాయి సీనియర్స్ బాల బాలికల సాఫ్ట్ బాల్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సాఫ్ట్ బాల్ సంఘం కార్యదర్శి కె.విజయ్ కుమార్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాస్థాయిలో క్రీడాకారుల్లోని క్రీడా నిపుణ్యాలను వెలికి తీసే విధంగా ఎంపిక నిర్వహిస్తామని తెలిపారు. ఎంపికైన బాలబాలికల జట్లు ఆగస్టు 10 నుంచి 12 వరకు చిత్తూరు జిల్లాలోని పుత్తూరు గవర్నమెంట్ హైస్కూల్ మైదానంలో జరిగే 11వ రాష్ట్రస్థాయి సీనియర్స్ సాఫ్ట్ బాల్ ఛాంపియన్షిప్ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు 4 పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలు, ఒరిజినల్ ఆధార్ కార్డుతో పాటు రూ.10 ప్రవేశ రుసుంతో ఈనెల 15న తనను సంప్రదించాలని కోరారు. 7032088008 నెంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

విషాహారం తిని జాతి కోళ్లు మృతి

ప్రజాశక్తి - తుగ్గలి

మండలంలోని లింగనేని దొడ్డి గ్రామంలో విషాహారం తిని ఓమార్, శైలం జాతి కోళ్లు మృతి చెందాయి. రూ.40 వేలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు పోలీస్ స్టేషన్లో బుధవారం ఫిర్యాదు చేశారు. బాధితుడు పెద్దయ్య మాట్లాడుతూ.. తాను వివిధ రకాల మేలు జాతి కోళ్లను పెంచుకుంటూ జీవనం సాగిస్తున్నానని తెలిపారు. తమ గ్రామానికి చెందిన బోయ చిన్న నరసింహులు గింజల్లో విషం కలిపి ఇంటి ముందు చల్లారని, గింజలను కోళ్లు తిని మృతి చెందాయని తెలిపారు. కోళ్లు మృతి చెందడం వల్ల నష్టం వాటిల్లిందని, కోళ్ల మృతికి కారణమైన బోయ చిన్న నరసింహులపై చర్యలు తీసుకోవాలని తుగ్గలి పోలీస్స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

విఆర్ఒ మద్దిలేటిని సస్పెన్షన్ చేయాలి

- కలెక్టరేట్ ఎదుట డివైఎఫ్ఐ ధర్నా

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కల్లూరు మండలంలో విఆర్ఒగా పని చేస్తూ అవినీతి, అక్రమాలకు పాల్పడిన కుమ్మరి మద్దిలేటిని సస్పెన్షన్ చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్ డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడారు. అవినీతికి పాల్పడి రూ.కోట్లు దండుకున్నట్లు మీడియాలో ప్రచురించారని తెలిపారు. సాధారణ కుటుంబం నుంచి విఆర్ఎగా పనిచేసి విఆర్ఒగా ప్రమోషన్ పొందిన మద్దిలేటి కర్నూలు మండలంలో పని చేసినప్పుడు కూడా అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నారన్నారు. ప్రస్తుతం కల్లూరు మండలంలో విధులు నిర్వహిస్తున్న విఆర్ఒ మద్దిలేటి ఈ మధ్యకాలంలో రూ.కోట్లు వెచ్చించి అతని స్వగ్రామంలో భారీ బిల్డింగ్ నిర్మించుకున్నారని తెలిపారు. ప్రస్తుతం డాక్టర్స్ కాలనీలో 11 సెంట్ల స్థలంలో భారీ బిల్డింగ్ నిర్మిస్తున్నారని చెప్పారు. సాధారణ కుటుంబం నుంచి వచ్చి విఆర్ఒగా విధులు నిర్వహించడం ద్వారా వచ్చే జీతంతో రూ.కోట్లకు కోట్లు సంపాదించడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ప్రజలు ఆయన దగ్గరకు ఏ పని మీద వెళ్లినా మామూలు ఇస్తే తప్ప పని చేయడని ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న విఆర్ఒ మద్దిలేటిపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. అతని అక్రమాలకు సహకరించిన తహశీల్దార్లపై కూడా విచారణ చేపట్టాలని కోరారు. డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి హుస్సేన్ బాషా, నగర అధ్యక్షులు గౌతమ్, జిల్లా నాయకులు రామకృష్ణ, ఏసు, నాయకులు నాగరాజు, చంద్ర, షేక్షావలీ పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

'సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం'

ప్రజాశక్తి - పత్తికొండ



సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రయివేట్ ఎమ్మెస్ ఆర్థో డాక్టర్ టి.కార్తీక్ తెలిపారు. బుధవారం పత్తికొండ కార్తీక హాస్పిటల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. వర్షాకాలంలో దోమల నుంచి సంక్రమించే డెంగీ, మలేరియా, చికున్‌గున్యా వ్యాధుల నివారణ చర్యలను తీసుకోవాలని తెలిపారు. డెంగీ దోమల ద్వారా ఒకరి నుంచి మరొకరికి వర్షాకాలంలో వేగంగా వ్యాప్తి చెందుతుందని చెప్పారు. నీరు నిల్వ ఉండే ప్రదేశాల్లోనే ఇవి ఎక్కువగా పెరుగుతాయన్నారు. వర్షాకాలంలో నీటి కాలుష్యం వల్ల టైఫాయిడ్, కలరా, హెపటైటిస్-బి వంటి అంటువ్యాధులు సోకకుండా నీటిని కాచి చల్లార్చి, వడబోసి తాగాలని తెలిపారు. ఇళ్లల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు, వృద్ధులు ఉంటే దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలని సూచించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఏవైనా ఆరోగ్య సమస్యలు ఉంటే వైద్యుల సలహాలు తీసుకోవాలన్నారు.

వ్యవసాయానుబంధ సిబ్బందికి న్యాయం చేయాలి : ఎంపిఇఒలు

ప్రజాశక్తి - సిబెళగల్

వ్యవసాయానుబంధ సిబ్బంది సమస్యలపై ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని ఎంపిఇఒలు డిమాండ్ చేశారు. బుధవారం కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, టిడిపి జిల్లా నాయకులు విష్ణువర్ధన్ రెడ్డికి వినతిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 2014లో టిడిపి ప్రభుత్వం ఎంపిఇఒలుగా రాష్ట్రంలో 1396 మందిని నియమించందని తెలిపారు. వేతనం రూ.12 వేలతో కుటుంబం గడవడం కష్టంగా ఉందని తెలిపారు. ఎంపిఇఒలు వెంకటేశ్వర్లు, సుమతి, శేఖర్, సోమేశ్వరి, రంగన్న, రామకృష్ణ ఉన్నారు.

పాఠ్య పుస్తకాలు అందజేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు అందించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా డిమాండ్ చేశారు. బుధవారం పాఠశాల విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అధికారి శామ్యూల్ పాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 7వ తరగతి విద్యార్థులకు పూర్తి స్థాయిలో పాఠ్యపుస్తకాలు ఇవ్వలేదన్నారు. చాలా పాఠశాలల్లో 10వ తరగతి విద్యార్థులకు ఫిజిక్స్ పుస్తకాలు రాలేదన్నారు. 6వ తరగతి విద్యార్థులకు సైన్స్, ఫిజిక్స్, సోషల్ పుస్తకాలు రాలేదని తెలిపారు. అలాగే గత కొద్ది సంవత్సరాలుగా పాఠశాలలు నడపడానికి గ్రాంట్స్ లేకపోవడంతో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ సొంత డబ్బులను ఖర్చు చేస్తున్నారని చెప్పారు. పాఠశాలలో ఖాళీగా ఉన్న నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

'పారిశుధ్య పనులు ముమ్మరం చేయాలి'

ప్రజాశక్తి - సి బెళగల్

గ్రామాల్లో పారిశుధ్య పనులను ముమ్మరం చేయాలని ఇఒఆర్‌డి సందీప్ పంచాయతీ అధికారులకు సూచించారు. బుధవారం కొండాపురం, ఈర్లదిన్నె గ్రామాల్లో కార్యదర్శులు బేగ్, రాజేష్ సమక్షంలో పరిసరాలను పరిశీలించి, తాగునీటి ట్యాంకులను తనిఖీ చేశారు. ముందుగా కొత్తకోట-2 సచివాలయాన్ని తనిఖీ చేసి సిబ్బంది పనితీరుపై సూచనలిచ్చారు. అనంతరం పారిశుధ్య పనులను ముమ్మరం చేసి ప్రజారోగ్యం కాపాడాలన్నారు.

కనీస వేతనాలు పెంచాలి

ప్రజాశక్తి - వెల్దుర్తి

కార్మికులకు కనీస వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని నాయకులు కోరారు. బుధవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. సిఐటియు నాయకులు జె.నాగేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, ప్రభుత్వ సంస్థల ప్రయివేటీకరణను ఆపాలని కోరారు. అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం, 104, 108, వెలుగు, మెప్మా, ఆయుష్, నేషనల్ హెల్త్ మిషన్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు, ఎస్ఎస్ఎ ఉద్యోగులకు సమ్మె కాలపు వేతనాలు, పెరిగిన అరియర్స్ తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆశావర్కర్స్ యూనియన్ నాయకులు అలివేలమ్మ, లలితమ్మ, అనిత, గీత, విఒఎల సంఘం నాయకులు పద్మావతి, వెంకటేశ్వర్లు, విఆర్ఎల సంఘం తరపున అయ్యస్వామి, వెంకట్ రాముడు, రిజ్వాన, ఎస్ఎస్ఎ ఉద్యోగుల సంఘం నుంచి కృష్ణ, రామయ్య, హమాలీ వర్కర్స్ యూనియన్ నుంచి మారెన్న, కృష్ణ, మల్లి, చిన్న ఏసు, పాపన్న పాల్గొన్నారు. **గూడూరు** తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సిఐటియు నాయకులు శాంతన్న అధ్యక్షత వహించారు. తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. సిఐటియు డివిజన్ కార్యదర్శి జె.మోహన్, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ మండల నాయకులు సుజాత, ఆర్‌పిల సంఘం జిల్లా అధ్యక్షులు ప్రభావతమ్మ, విఒఎల సంఘం నాయకులు మనోహరి మాట్లాడారు. అంగన్వాడీలు వరలక్ష్మి, సునంద, మంజుల, రత్నమ్మ, రామాంజనమ్మ, రామలక్ష్మి, మున్సిపల్ కార్మికులు సూర్య శేఖర్, ఆర్‌పిలు యశోద, భారతి, శాంతి, ప్రభావతి, విఒఎలు చంద్రకళ పాల్గొన్నారు. **సిబెళగల్** మండలంలోని అంగన్వాడీలతో కలిసి తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. సిఐటియు ప్రాంతీయ నాయకులు మోహన్ మాట్లాడారు.

క్యాత్ ల్యాబ్ ద్వారా అత్యధిక ప్రొసీజర్లు

- జెమ్‌కేర్ కామినేని ఆస్పత్రి సిఇఒ చంద్రశేఖర్ రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

రాయలసీమలోనే అత్యంత వేగంగా కేవలం మొదలు పెట్టిన 10 నెలల్లోనే 550 కి పైగా ప్రొసీజర్లు చేసి క్యాత్ ల్యాబ్ ప్రొసీజర్లో తిరుగులేని హాస్పిటల్‌గా దూసుకెళ్తం ని జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్ సీఈఓ డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. తమ దగ్గర అత్యంత ఆధునిక ఎక్విప్మెంట్ గల క్యాత్ ల్యాబ్ 24/7 అందుబాటులో ప్రత్యేకమైన టీంతో ఉంటుందని తెలిపారు. ఈ 550 ప్రొసీడర్స్ సంక్లిష్టమైన స్టెంటింగ్, చిన్న పిల్లలో సంక్లిష్టమైన వాల్ రీప్లేస్మెంట్‌లు ఎన్నో జరిగాయని, పేస్‌మేకర్స్‌లో కండక్షన్ పేసింగ్ సిస్టమ్ లాంటి అత్యాధునిక ప్రొసీజర్స్, కాంప్లెక్స్ యాంజియోప్లాస్టీలో రోటబ్లేషన్, బెలూన్ వాల్వులోప్లాస్టీ, డివైస్ క్లోజర్స్‌లాంటి అరుదైన క్లిష్టమైన ప్రొసీడర్స్ చేశామని పేర్కొన్నారు. చీఫ్ కార్డియాలజిస్టు డాక్టర్ రాఘవేంద్ర మాట్లాడుతూ నతి కాలంలోనే క్యాథ్ ల్యాబ్‌లో 550 కి పైగా ప్రొసీజర్స్ చేయడం చాలా గర్వకారణంగా ఉందని తనకు సహకరించిన తన టీంకి, హాస్పిటల్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. రానున్న కాలంలో మరెన్నో సర్జరీలు చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్మోహన్ రెడ్డి, సిఒఓ డాక్టర్ గణేష్, జనరల్ మేనేజర్ నదీమ్, క్యాథ్ ల్యాబ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎడిఫైలో కంటి చూపు స్క్రీనింగ్ క్యాంపు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

నగర శివారులోని ఎడిఫై వరల్డ్ స్కూల్‌లో కంటి చూపు స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించారు. బుధవారం ప్రముఖ ఆప్తమాలజిస్ట్ డాక్టర్ స్ఫూర్తి రెడ్డి బృందం నూతన, అధునాతనమైన సదుపాయాలతో, పరికరాలతో విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు కూడా స్క్రీనింగ్ పరీక్షల్లో పాల్గొన్నారు. కంటి సమస్యలను ఏ విధంగా ఎదుర్కోవాలో డాక్టర్ స్ఫూర్తి రెడ్డి వివరించారు. పాఠశాల డైరెక్టర్లు డాక్టర్ సతీష్ కుమార్, డాక్టర్ మనోజ్‌కుమార్, పాఠశాల ప్రిన్సిపల్ జోసెఫ్ డేవిడ్ పాల్గొన్నారు.



విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ స్ఫూర్తి రెడ్డి

బాలుని మృతిపై విచారణ

- వైద్యం చేస్తే ఆర్ఎంపిలపై చర్యలు
- డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సత్యవతి

ప్రజాశక్తి - గోనెగండ్ల


విచారణ చేపడుతున్న డాక్టర్ సత్యవతి

మండలంలోని గంజిహళ్లి గ్రామంలో రెండు రోజుల క్రితం జ్వరం తగ్గడానికి ఓ ఆర్ఎంపి ఇచ్చిన ఇంజక్షన్ వికటించి బాలుడు రాజేష్ (12) మృతి చెందారు. ఈ ఘటనపై డిప్యూటి డిఎంహెచ్ఒ డాక్టర్ సత్యవతి బుధవారం గంజిహళ్లి గ్రామంలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ ఘటనపై బాలుని కుటుంబ సభ్యులను విచారించగా బాలునికి జ్వరంగా ఉండడంతో గ్రామంలోని ఆర్ఎంపి వద్ద ఇంజక్షన్ చేయించినట్లు తెలిపాలని అన్నారు. అది వికటించి ఇన్ఫెక్షన్ సోకిందని, కర్నూలులోని కిమ్స్ ప్రయివేట్ ఆస్పత్రిలో చేర్పించినట్లు తెలిపారు. అప్పటికే ఇన్ఫెక్షన్ శరీరమంతా సోకి వెంటిలేటర్‌పై ఉంచి వైద్యం అందించినా బాలుడు మృతి చెందినట్లు తెలిసిందన్నారు. అలాగే ఇంజక్షన్ ఇచ్చిన ఆర్ఎంపితో పాటు గ్రామంలోని ఇతర ఆర్ఎంపిలను కూడా పిలిపించి విచారించినట్లు తెలిపారు. రోగులకు ట్యాబ్లెట్ ఇచ్చి ప్రాథమిక చికిత్స అందించాలని, ఇంజక్షన్ వేయడం ఐవి ఫ్లూయిడ్స్ బాటిల్స్ ఎక్కించడం, గర్భిణులకు వైద్యం లాంటివి చేయకూడదని హెచ్చరించామన్నారు. పూర్తిస్థాయి నివేదికను తయారు చేసి డిఎంహెచ్ఒకు పంపుతామని తెలిపారు. ఆయన ఆదేశాల మేరకు తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. గోనెగండ్ల ప్రభుత్వాస్పత్రి వైద్యులు డాక్టర్ కార్తీక్, ఎంపిహెచ్ఇఒ హనుమంతు పాల్గొన్నారు.

'విద్యుత్ సరఫరాను మార్పు చేయండి'

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

విద్యుత్ సరఫరా సమయాన్ని మార్పు చేయాలని రైతులు కోరారు. ప్రభుత్వం రైతులకు రాయితీ కింద సరఫరా చేసే విద్యుత్ గత కొన్ని రోజుల నుంచి పగటి పూట వరుసగా ఇవ్వడంతో బోర్లు పాడవుతాయని నాగలాపురం రైతులు సంగటి లింగన్న, రామలింగ, ధనాంజి, భీమా తెలిపారు. బుధవారం ఆదోని రూరల్ ఎఇ చెన్నయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడారు. పగటి పూట వరుసగా విద్యుత్ సరఫరా చేయడంతో మోటార్లు పాడవుతున్నాయని తెలిపారు. దానికి తోడు సకాలంలో వర్షాలు కురువకపోవడంతో బోరుబావుల్లో కూడా నీళ్లు ఇంకిపోతున్నాయని చెప్పారు. బోరుబావుల్లో నీరు తక్కువగా వస్తున్నాయని, దీనివల్ల విద్యుత్ మోటార్లు చెడిపోతున్నాయని తెలిపారు. విద్యుత్ అధికారులు స్పందించి రాత్రి సమయంలోనూ కొంత, పగటి సమయంలో కొంత విద్యుత్‌ను సరఫరా చేస్తే బాగుంటుందని కోరారు. ఎఇ మాట్లాడుతూ...ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి విద్యుత్ సరఫరాలో మార్పులు చేసే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే విరుపాక్షి

ప్రజాశక్తి - చిప్పగిరి



కలెక్టర్ రంజిత్ బాషాను ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కర్నూలు పశ్చిమ ప్రాంతమైన ఆలూరు నియోజకవర్గం అన్ని రంగాల్లో చాలా వెనుకబడిందని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఆలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో తాగునీటి సమస్య ఉందని తెలిపారు. మండలాల్లో దాదాపు అన్ని గ్రామాల్లోనూ పర్యటించానని, ప్రతి గ్రామంలో కూడా రోడ్లు లేక, తాగునీటి సమస్య వెంటాడుతోందని చెప్పారు. సరైన పంటలు పండక వలస వెళ్లే గ్రామాలు చాలా ఎక్కువగా ఉన్నాయన్నారు. చిప్పగిరి దగ్గర ఉన్న హంద్రీనీవాకు అధికారికంగా ప్రత్యేక తూము ఏర్పాటు చేసి ఎబిసి కాలువ ద్వారా సాగునీటిని అందించి ప్రజలను ఆదుకోవాలని కోరారు.

ముగిసిన వేలం పాటలు

ప్రజాశక్తి- గోనెగండ్ల

గోనెగండ్ల మేజర్ పంచాయతీకి ఇఒఆర్‌డి నగేష్, సర్పంచి హైమావతి, పంచాయతీ కార్యదర్శి సతీష్ ఆధ్వర్యంలో బుధవారం వేలం పాటలు నిర్వహించారు. బండిమెట్ట రూ.46 వేలు, సంత మార్కెట్ రూ.33 వేలకు ఎ.బడేసా పాడి దక్కించుకున్నారు. ఎన్‌వి.శేషాద్రి నాయుడు రూ.56 వేలకు కమేళాను దక్కించుకున్నారు. ఈ వేలం పాటల ద్వారా గోనెగండ్ల మేజర్ పంచాయతీకి రూ.1.35 లక్షల ఆదాయం చేకూరింది. పంచాయతీ సిబ్బంది సుభాన్, అనిల్, మలాంగ్, సచివాలయ సిబ్బంది, వేలం పాటదారులు పాల్గొన్నారు.

'శ్రీకృష్ణ చారిత్య మంజరి' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - మంత్రాలయం

మహారాష్ట్రలోని ముంబయిలో గల రాజ్‌భవన్‌లో బుధవారం శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు మహారాష్ట్ర గవర్నర్ రమేష్ బాయిస్‌తో కలిసి 'శ్రీకృష్ణ చారిత్య మంజిరి' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని పుణెలోని ప్రొఫెసర్ గురురాజ్ కులకర్ణి మరాఠీ భాషలో అనువదించారు. శ్రీరాఘవేంద్రస్వామి వారు రచించిన శ్రీకృష్ణ చరిత మంజరిని శ్రీగురు సార్వభౌమ సంస్కృత విద్యాపీఠం ఆధ్వర్యంలో సంపాదకులుగా రాష్ట్రపతి అవార్డు గ్రహీత రాజా ఎస్.గిరియాచార్యులు సంకలనం చేసినట్లు తెలిపారు. పీఠాధిపతుల పూర్వాశ్రమ కుమారులు రాజా అప్రమేయచార్య, టర్కర్ల రామకృష్ణ, అక్షయ్, ప్రశాంత్ జోషి పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి

- వ్యకాస జిల్లా అధ్యక్షులు వీరశేఖర్

ప్రజాశక్తి - దేవనకొండ

కార్మికుల హక్కుల కాలరాసే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, స్కీం వర్కర్లకు కనీస వేతనాలు, అసంఘటితరంగా కార్మికులకు సమగ్ర కార్మిక చట్టం అమలు చేయాలని వ్యకాస జిల్లా అధ్యక్షులు బి.వీరశేఖర్, సిఐటియు మండల కార్యదర్శి అశోక్ డిమాండ్ చేశారు. బుధవారం సిఐటియు పిలుపుమేరకు దేశవ్యాప్త నిరసనలో భాగంగా దేవనకొండ తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. అంతకుముందు హమాలీ వర్కర్స్ యూనియన్ కార్యాలయం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సిఐటియు మండల నాయకులు సరోజమ్మ, సిఐటియు మండల అధ్యక్షులు పాండు అధ్యక్షతన ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. స్కీం వర్కర్లకు కనీస వేతన అమలు చేయాలని, అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర కార్మిక చట్టం అమలు చేయాలని కోరారు. స్కీం వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, నాలుగు కోడ్‌లుగా విభజించిన చట్టాలను రద్దు చేయాలని కోరారు. ఎల్ఐసి, బిఎస్ఎన్ఎల్, పోస్టల్, డిఫెన్స్, రైల్వే ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ ప్రయివేటీకరించడం దుర్మార్గమని తెలిపారు. ఐసిడిఎస్‌ను బలోపేతం చేయాలని, బడ్జెట్ పెంచాలని, అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. గ్రాట్యుటీ అమలు చేయాలని, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించి స్కీం వర్కర్లను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల్లో పనిచేస్తున్న కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఈఎస్ఐ, పిఎఫ్, పింఛను సౌకర్యాలు కల్పించాలని కోరారు. అంగన్వాడీ, విఒఎ, హమాలీ వర్కర్స్ యూనియన్, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు, ప్రజాసంఘాల నాయకులు మహబూబ్ బాషా, లక్ష్మిరెడ్డి, ఇనాయతుల్లా, సుధాకర్, రవీంద్ర, కౌలుట్ల స్వామి, సుంకన్న, వరలక్ష్మి, లక్ష్మీదేవి, సుజాత, భారతి, రామాంజనేయులు, ఏలియా, లోకయ్య, అంజి, రాము, నాగేంద్ర, మహేష్, మునిస్వామి, వెంకటేశ్వర్లు, మనోహర్ పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు (రూరల్)**లో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.రామాంజనేయులు, మండల అధ్యక్షులు సి.గోవిందు, మండల కార్యదర్శి బి.రాముడు ఆధ్వర్యంలో 500 మంది కార్మికులతో కలిసి సోమప్ప సర్కిల్ నుంచి వైఎస్ఆర్ సర్కిల్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఆశా, అంగన్వాడీ, మున్సిపల్, స్వచ్ఛభారత్, కెవికె, సర్వ శిక్ష అభియాన్ నాయకులు బి.గోవర్ధనమ్మ, నాగలక్ష్మి, శైలజ, శివలక్ష్మి, సిద్ధ రామప్ప, కేశన్న, సునంద స్వామి, వరలక్ష్మి, చిట్టెమ్మ పాల్గొన్నారు. **ఆదోని** మున్సిపల్ మైదానం నుంచి ర్యాలీగా వచ్చి పట్టణ అధ్యక్షులు తిప్పన అధ్యక్షతన ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. పట్టణ కార్యదర్శి పిఎస్.గోపాల్, మండల అధ్యక్షులు రామాంజనేయులు, అంగన్వాడీ నాయకులు వరలక్ష్మి, రిజ్వానా, సరోజ, గీతమ్మ, సోమక్క, తిక్కప్ప, కృష్ణమూర్తి హనుమంతు, గోవిందు, లక్ష్మీదేవి, లలిత, కరుణ, అజీమ్ ఖాన్ పాల్గొన్నారు. **హోళగుంద** తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. అనంతరం ఆర్ఐ దినోజ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. సిఐటియు మండల కార్యదర్శి నాగరాజు, సీనియల్ నాయకులు వెంకటేష్, అంగన్వాడీ టీచర్, ఆశావర్కర్స్ యూనియన్ నాయకులు లక్ష్మి, సలోమీ, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున పాల్గొన్నారు. **ఆస్పరి** తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. అనంతరం తహశీల్దార్ ఈరమ్మకు వినతిపత్రం అందజేశారు. సిఐటియు మండల కార్యదర్శి రామాంజనేయులు, నాయకులు రంగస్వామి, బాలకృష్ణ, అంగన్వాడీ టీచర్స్ విశ్వకుమారి, లత, విజయలక్ష్మి, గోవిందమ్మ, పద్మావతి, మస్తాన్‌బీ పాల్గొన్నారు. **హాలహర్వి**లో సిఐటియు నాయకులు కృష్ణ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం తహశీల్దార్ బ్యూలా, డిటి లక్ష్మికి వినతిపత్రం అందించారు. విఠల్, అంగన్వాడీ కార్యకర్తలు సుజాత పాల్గొన్నారు. **పెద్దకడబూరు** తహశీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. తహశీల్దార్ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. సిఐటియు గౌరవాధ్యక్షులు తిక్కన్న, నాయకులు ఈరన్న, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు జయమ్మ, చిట్టెమ్మ, సుకన్య, థెరిస్సమ్మ, శారద, అయ్యమ్మ పాల్గొన్నారు. **ఆలూరు** గెస్ట్ హౌస్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, తహశీల్దార్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కెపి.నారాయణస్వామి, సిఐటియు నాయకులు శేఖర్, జయశ్రీ, భారతి, ప్రభావతి, బాల రంగమ్మ, లక్ష్మి, కళావతి, రత్నమ్మ, రంగమ్మ, నాగరాజు, వీరేష్, సురేష్, ఎల్లప్ప పాల్గొన్నారు.


దేవనకొండ తహశీల్దార్ కార్యాలయం ముందు సిఐటియు ధర్నా

'నవోదయ కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలి'

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న నవోదయ కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి విజయ్ కుమార్, ఐసా జిల్లా సహాయ కార్యదర్శి రాజు డిమాండ్ చేశారు. బుధవారం విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఎంఇఒ ఆంజనేయులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పట్టణంలో ఉన్న నవోదయ కోచింగ్ సెంటర్లకు ప్రభుత్వ అనుమతులు లేకున్నా విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి రూ.వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తూ నిర్వహిస్తున్నారని తెలిపారు. కనీస సౌకర్యాలు కల్పించకుండా రేకుల షెడ్లలో కోచింగ్ సెంటర్ నిర్వహిస్తూ, హాస్టల్ ఏర్పాటు చేసుకుని విద్యార్థులకు నాసిరకమైన భోజనం పెడుతున్నారని విమర్శించారు. విజిలెన్స్ దాడులు నిర్వహించి అనుమతుల్లేని కోచింగ్ సెంటర్లను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రమోద్, సుభాన్, ఐసా నాయకులు రాజు, చిన్న పాల్గొన్నారు.

గాజులదిన్నె ప్రాజెక్టు పరిశీలన

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలోని గాజులదిన్నె ప్రాజెక్టును బుధవారం కేంద్ర బృందం సభ్యులు సందర్శించి పరిశీలించారు. ప్రత్యేక బోటు ద్వారా కేంద్ర బృందం సభ్యులు జలాశయంలో సంచరించి సర్వే నిర్వహించినట్లు ప్రాజెక్టు డిఇ విజయకుమార్ తెలిపారు. ప్రాజెక్టు పూర్తి నీటిసామర్థ్యం, ప్రస్తుత నీటి నిల్వ వివరాలు, జలాశయంలో పూడిక ఏ స్థాయిలో ఉందన్న అంశాలపై వారు సర్వే నిర్వహించారని, అన్ని రిజర్వాయర్లు, ప్రాజెక్టుల స్థితిగతుల పరిశీలనలో భాగంగా ఈ బృందం సర్వే నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

ప్రొటోకాల్ పాటించకుంటే తీవ్ర పరిణామాలు

- ఎమ్మెల్యే బాల నాగిరెడ్డి
- మండల సర్వసభ్య సమావేశంలో అధికారులపై ఆగ్రహం

ప్రజాశక్తి - పెద్దకడబూరు

ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇవ్వకుండా ప్రొటోకాల్ విస్మరిస్తే అధికారులు తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి హెచ్చరించారు. బుధవారం ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి శ్రీవిద్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా సర్వసభ్య సమావేశంలో వివిధ శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను వివరించారు. ఇటీవల విద్యార్థులకు అందజేసిన విద్యాకానుక కిట్ల పంపిణీలో స్థానిక ప్రజాప్రతినిధులు ఎంపిపి, జడ్‌పిటిసి, సర్పంచులకు సమాచారం ఇవ్వకుండా ప్రొటోకాల్ పాటించని ఎంఇఒలపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. పంపిణీ కార్యక్రమానికి ప్రజాప్రతినిధుల ను ఎందుకు పిలవలేదని, అనధికార వ్యక్తుల చేత ఎలా పంపిణీ చేస్తారని ప్రశ్నించారు. ఈ విషయంపై టిడిపి ఎంపిటిసి నర్స శశిరేఖ మాట్లాడుతూ... అధికారులు తప్పకుండా ప్రొటోకాల్ పాటించాలనే విషయాన్ని తాను అనేక సార్లు సర్వసభ్య సమావేశంలో వెల్లడించినట్లు గుర్తు చేశారు. స్థానిక సంస్థలు అంటే స్థానిక ప్రభుత్వాలని, అధికారులు ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలని తెలిపారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి మాట్లాడుతూ... రాజకీయాలు ఎన్నికల వరకే ఉండాలని, ప్రజాసేవకు పార్టీలను పక్కనపెట్టి ప్రజాప్రతినిధులు పనిచేయాలని సూచించారు. అధికారులు కూడా ఇందుకు సహకరించాలని కోరారు. జడ్‌పిటిసి రాజేశ్వరి, ఎంపిడిఒ జనార్ధన్, తహశీల్దార్ నాగరాజు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చూడాలి

- ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు అందుబాటులో ఉండి పరిష్కరించి, ఎలాంటి ఇబ్బందులూ లేకుండా చూడాలని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి తెలిపారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలకు ఉచిత ఇసుక పంపిణీపై అధికారులతో చర్చించారు. పురవీధుల్లో కుక్కల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలతో పాటు పశువుల పరిరక్షణకు చేపట్టాల్సిన జాగ్రత్తలను సూచించారు. పడిపోయే దశలో ఉన్న విద్యుత్ స్తంభాలు, విద్యుత్ లైట్లను పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు. నీటి సరఫరా, కొత్త నీటి పైపులైన్లు, కనెక్షన్లపై చర్చించారు.


అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే బీవీ



బాబు దృష్టికి జిల్లా సమస్యలు

ప్రజాశక్తి - మంత్రాలయం

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసి సమస్యలు విన్నవించినట్లు టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడారు. అమరావతిలో కౌతాళం మండల నాయకులు చెన్నబసప్పతో కలిసి చంద్రబాబును కలిశామని పేర్కొన్నారు. జిల్లాలోని పశ్చిమ ప్రాంతం నుంచి వలసలు ఎక్కువగా ఉన్నాయని, వాటిని నివారించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకొని వలసలను నివారించాలని కోరినట్లు తెలిపారు. జిల్లాలో తాగు, సాగునీటి సమస్య ఉన్నందున శాశ్వతంగా పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరామని చెప్పారు. జిల్లాలోని టిడిపికి సబంధించిన సంస్థాగత విషయాలపై, ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేసిన వారిని అభినందించాలని కోరినట్లు తెలిపారు.

బాబును కలిసిన మీనాక్షి

ప్రజాశక్తి - ఆదోని

అమరావతి సచివాలయం ఛాంబర్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసి ఆదోని అభివృద్ధిపై చర్చించినట్లు బుధవారం టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు మీనాక్షి నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత ఎన్నికల ప్రచారంలో భాగంగా నియోజకవర్గానికి ఇచ్చిన హామీలు అమలు చేసి అభివృద్ధి పథంలో నడిపించాలని కోరామన్నారు. ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు.

ఘనంగా వీరభద్ర గౌడ్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - ఆలూరు

టిడిపి నియోజవర్గ సీనియర్ నాయకులు వీరభద్ర గౌడ్ పుట్టినరోజు వేడుకలు బుధవారం ఆలూరులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు ప్రధాన రహదారి గుండా పార్టీ కార్యాలయం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. టిడిపి కార్యాలయంలో కార్యకర్తల మధ్య ఆయన కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తనను అభిమానించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసేందుకు వచ్చిన టిడిపి నాయకులు, కార్యకర్తలకు, బిజెపి, జనసేన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. అందరి సహకారంతో, పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తామని చెప్పారు. ఇంత పెద్ద ఎత్తున తరలి రావడం ఆనందంగా ఉందన్నారు. స్థానిక ఆది ఆంధ్ర స్కూల్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ రామ్‌నాథ్ యాదవ్, మాజీ జడ్‌పిటిసి మీనాక్షి నాయుడు, రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి మనేకుర్తి రాజశేఖర్, గిరి మల్లేష్ గౌడ్, సీనియర్ నాయకులు కృష్ణం నాయుడు, బిలేకల్ వెంకటేష్, విజయ భాస్కర్ గౌడ్, హరి రెడ్డి, పాల్ రెడ్డి, సీనప్ప, ఉచ్చీరప్ప, నర్సప్ప, నారాయణ, ఎల్లార్తి మల్లికార్జున, హాలహర్వి నరసప్ప, సర్పంచి మల్లికార్జున, సురేంద్ర, ముద్దురంగయ్య, కొమ్ము రామాంజి, నెట్టప్ప, కురువ తిప్పేస్వామి, తిమ్మయ్య, గూళ్యం రామాంజినేయులు, జగన్, రాము యాదవ్, వన్నూరు వలీ, ఈరన్న, కిట్టు, రాజు, దద్దు, గుండయ్య పాల్గొన్నారు. **ఆస్పరి**లో వీరభద్ర గౌడ్ పుట్టినరోజు వేడుకలను బిజెపి ఆలూరు ఇన్‌ఛార్జీ వెంకట రాముడు, టిడిపి సీనియర్ నాయకులు తిమ్మన్న, సంజప్ప, జనసేన మండల కన్వీనర్ అరవింద్ ఆధ్వర్యంలో గాంధీ పార్కులో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఎంపిటిసి రహంతుల్లా, నాయకులు ముత్యాల రెడ్డి, సతీష్ కుమార్, జేమ్స్, మాబు, చిదానంద, నాగన్న, శ్రీనివాసులు, యుగంధర్, మారేష్, వెంకటేష్, నాగేంద్ర, మనోజ్, మహేష్ పాల్గొన్నారు.


ఆలూరులో ర్యాలీలో పాల్గొన్న వీరభద్ర గౌడ్


ఆస్పరిలో కేక్ కట్ చేసి తినిపించుకుంటున్న నాయకులు

ప్రత్యేక విద్యార్థి బస్సు నడపాలి

- ఎస్ఎఫ్ఐ,డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - ఆలూరు


మండలంలోని కురుకుంద, ముద్దనగేరి గ్రామ విద్యార్థుల కోసం ప్రత్యేక విద్యార్థి బస్సు సర్వీసు నడపాలని ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు కోరారు. బుధవారం ఆదోని డిపో మేనేజర్ ఎమ్‌డి.రఫీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మైనా మాట్లాడారు. మండలంలోని ప్రభుత్వ బాలికలు, బాలుర ఉన్నత పాఠశాలకు, జూనియర్, మోడల్, ఐటిఐ కళాశాలలకు కురుకుంద, ముద్దనగేరి గ్రామాల నుంచి వంద మందికి పైగా విద్యార్థులు ఆలూరుకు వస్తుంటారని తెలిపారు. ప్రస్తుతం వీరికి బస్సు సౌకర్యం లేకపోవడంతో ఆటోలో ప్రమాదకర పరిస్థితిలో ప్రయాణం చేయాల్సి వస్తోందన్నారు. వర్షాకాలం కావడంతో విద్యార్థులు వర్షానికి తడుస్తూ సమయానికి కళాశాలకు, పాఠశాలలకు చేరుకోలేని దుస్థితి ఏర్పడిందని తెలిపారు. కరోనా కారణంగా పాఠశాలలు, కళాశాలలు సరిగా లేకపోవడంతో విద్యార్థి బస్సును ఆపేశారని చెప్పారు. ప్రస్తుతం కురుకుంద విద్యార్థి బస్సును పునః ప్రారంభించాలని కోరారు. కురుకుంద, ముద్దనగేరి గ్రామ విద్యార్థుల చదువును దృష్టిలో ఉంచుకుని వారికి ప్రత్యేక విద్యార్థి బస్సు సర్వీసు నడిపాలని తెలిపారు. డివైఎఫ్ఐ జిల్లా నాయకులు గోవర్ధన్, ఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యక్షులు గిరిమూర్తి, ఆదోని పట్టణ ఉపాధ్యక్షులు శశికుమార్, డివైఎఫ్ఐ నాయకులు మధు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- జనసేన ఆలూరు ఇన్‌ఛార్జీ తెర్నేకల్ వెంకప్ప

ప్రజాశక్తి - దేవనకొండ

ఆలూరు నియోజకవర్గంలో గ్రామాల్లోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని జనసేన ఇన్‌ఛార్జీ తెర్నేకల్ వెంకప్ప తెలిపారు. బుధవారం దేవనకొండలో మూగీతాత దర్గా కమ్యూనిటీ భవనంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో మండల స్థాయి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కప్పట్రాళ్ల, కరిడికొండ, అల్లారుదిన్నె, కరివేముల, దేవనకొండ, జిల్లేడుబుడకల గ్రామాల నుంచి వైసిపి, టిడిపి కార్యకర్తలు సుమారు 200 మంది జనసేనలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో జనసేన నాయకులు కూటమి నాయకులతో సమన్వయంగా ఉండి గ్రామాల్లోని సమస్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని కోరారు. మండలంలో వివిధ గ్రామాలకు రోడ్ల సౌకర్యాలు, తాగునీరు, డ్రైనేజీ, సిసి రోడ్ల సమస్యలు ఉన్నాయని, వాటిని గుర్తించాలని తెలిపారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు బాగా లేవని, రాష్ట్రం లోటు బడ్జెట్‌లో ఉందని చెప్పారు. దానిని అధిగమించేందుకు కొంత సమయం పడుతుందన్నారు. జనసేన నాయకులు కలిసికట్టుగా ఉండాలని సూచించారు. కూటమి ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించేలా సేవాభావంతో పని చేయాలని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నాటికి బూత్ కమిటీలను పటిష్టంగా ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. జనసేన పార్టీ మండల కన్వీనర్ వీరేష్, మండల నాయకులు జగదీష్, ఆంథోని, నందు, జనసేన వీర మహిళ సరోజమ్మ, హబీబా, నాయకులు ఉచ్చీరప్ప, రామాంజనేయులు, నాగరాజు పాల్గొన్నారు.


భారీగా జనసేన పార్టీలోకి చేరికలు